సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

నియోజకవర్గ పరిధిలో టిడిపి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మరం సెంటర్ రామాలయం వద్ద టిడిపి నాయకులు, వార్డు కన్వీనర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమార స్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ పరిధిలో జరిగిన సభ్యత్వ నమోదుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బుదులు శ్రీకాంత్, టిడిపి నాయకులు బలుసు వాసు, కంటే జగదీష్ మోహన్, యర్రగడ్డ రవిచంద్ర ప్రసాద్, వల్లూరి దొరబాబు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం..!

- యథేచ్ఛగా బహిరంగ విక్రయాలు
- నామమాత్రపు చర్యలకే అధికారులు పరిమితం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం ప్రకటనలు ప్రచారానికి మాత్రమే పరిమితం అవుతున్నాయి. ఎక్కడికక్కడ యథేచ్ఛగా ప్లాస్టిక్ సంచుల విక్రయాలు బహిరంగంగానే సాగుతున్నాయి. అధికారులు మాత్రం నామమాత్రపు చర్యలకే పరిమితం అవుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలతో పాటు అన్ని మున్సిపాలిటీలు, పలు మండల కేంద్రాల్లో అధికార యంత్రాంగం కార్యరంగంలోకి దిగాయి. నిషేధ ఆంక్షలను గతంలోనే అన్నిచోట్లా అమల్లోకి తీసుకొచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న వ్యాపారులకు భారీగా జరిమానా విధించడానికి సైతం వెనుకాడటం లేదని వారు ప్రకటిస్తున్నారు. వరుసగా రెండు సార్లు పట్టుబడిన దుకాణాలను సీజ్ చేస్తామని కూడా చెప్పుకొచ్చారు. అయితే జిల్లాలో అనేక చోట్ల ప్లాస్టిక్ వినియోగం యథావిధిగా జరిగిపోతుంది. ఎక్కడ బడితే అక్కడ కవర్లను పలువురు వ్యాపారులు బహిరంగంగానే విక్రయాలు చేస్తున్నారు. అయితే అధికారులు ప్రకటనలు ఇచ్చి తూతుమంత్రంగా మాత్రమే చర్యలు తీసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. పూర్తి స్థాయిలో కఠిన చర్యలు లేకపోవడం వలన మళ్లీ మళ్లీ విక్రయాలు జరుపుతున్నారు.

అరకొర తనిఖీలు..?

స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షన్ వంటి కార్యక్రమాల ద్వారా జిల్లాలో నగరాలు, మున్సిపాలిటీల్లో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతుంది. యథేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పరిశుభ్రత కోసం ఇక్కడ సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నా స్వచ్ఛతపై ఆశించిన ఫలితాలను సాధించలేకపోతున్నారు. పట్టణాలు, నగరాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. దీంతో పలు చోట్ల ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. ప్లాస్టిక్ వినియోగం అనర్థమని తెలిసినా అధికార యంత్రాంగం పలు చోట్ల తమకేమీ పట్టనట్లే వ్యవహరిస్తున్నారు.

స్మార్ట్ సిటీలో విక్రయాలు షురూ..

కాకినాడ స్మార్ట్ సిటీలో 50 డివిజన్లలో సుమారు 5 లక్షల మంది జనాభా ఉన్నారు. వేల కొద్దీ దుకాణాలు ఇక్కడ ఉన్నాయి. అయితే అనేక మంది వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లలో చెత్తను నింపి రోడ్లపై వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ ను ఎక్కువగా వాడుతున్నారు. పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నగరంలో దాదాపు 3 లక్షలకు పైగా ప్లాస్టిక్ కవర్లు, ఇతర నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు ఒక రోజులో వినియోగం అవుతున్నట్లు ఓ అంచనా. హోటళ్లు, పళ్ళ దుకాణాలు, బడ్డి కొట్లులలో ఎక్కువగా వినియోగిస్తున్నారు .ఇవన్నీ మరుసటి రోజుకు చెత్తగా మారుతున్నాయి. డ్రెనేజీల్లోకి చేరి చెత్తగా మారి కాలుష్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. అయితే ఇక్కడ అధికారులు కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులపై కొరడా ఝుళిపిస్తున్నా ఫలితం నామమాత్రంగానే ఉంటుంది. నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖ అధికారులు ఈ రెండేళ్లలో వందల సంఖ్యలో కేసులు నమోదు చేశారు. నిషేధిత కవర్లు, గ్లాసులను అమ్మకాలు జరుపుతున్న వారికి రూ.5 లక్షల వరకూ అపరాధ రుసుం విధించారు. దాదాపు 1000 కేజీల కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నట్లు ప్రజారోగ్య శాఖ అధికారులు తెలిపారు. అయితే ఇక్కడ నిషేధాజ్ఞలు సక్రమంగా అమలవ్వకపోవడంతో కవర్లు, గ్లాసుల వినియోగం ఆగలేదు. తూతుమంత్రపు దాడులతో సరిపెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సరైన చర్యలు చేపట్టి ప్లాస్టిక్ నిషేధ ఆజ్ఞలను పక్కాగా అమలు చేయాలని కోరుతున్నారు.

కొరవడిన అవగాహన

పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 లో భాగంగా ప్లాస్టిక్ ఉత్పత్తులు, వినియోగంపై జిల్లాలో పలు చోట్ల పదేళ్ళుగా నిషేధాజ్ఞల చట్టాన్ని అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వల్ల కలిగే అనార్థాలపై అధికారులు కొంత కాలంపాటు అవగాహన కల్పించారు. అమ్మకాలపై మొదట్లో కొరడా ఝుళిపించారు. అంతా ఓ ఉద్యమంలా సాగించారు. ఆ తర్వాత నిషేధంపై అధికారులు అంతగా పట్టించుకోకుండా వదిలేసారనే విమర్శలు వస్తున్నాయి. ప్రజల్లో అవగాహన కల్పిచడంలో అంతగా పట్టిచుకోవడం లేదనే ఆరోపణలు కూడా అధికారులపై వచ్చాయి. దీంతో ప్లాస్టిక్ వాడకం యథావిధిగా జరిగిపోతుంది .నిషేధం అమలుకు ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకోవాలి. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు నిషేధాంక్షలు పలుసార్లు నిర్వీర్యం కావడానికి ప్రధాన కారణంగా నిలుస్తుంది. దీనిని అధిగమించాలంటే ఒకవైపు అమ్మకందార్లను కట్టడి చేస్తూనే మరోవైపు ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

పెద్దాపురంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

26న ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం, యు.కొత్తపల్లి

ఈనెల 26న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో శనివారం సిఐటియు, ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు చింతల సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో 3వ సారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తూనే ఉందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులు, సంపద సృష్టికర్తలైన కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం పని చేస్తుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పులను కూడా లెక్కచేయకుండా వ్యవహరిస్తోందన్నారు. సమాజంలో అన్ని విభాగాల కార్మికులు పెరుగుతున్న ధరలతో సతమతమవుతూ అవస్థలు పడుతున్నారన్నారు. ఈ తరుణంలో కార్మికులు, ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మాత్రం రూ.20 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, పొండగరిని పెయింటింగ్ యూనియన్ అధ్యక్షులు వడ్డి సత్యనారాయణ, మడిమ్మ బల్లి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదిరెడ్డి శ్రీను, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వర్రె రమణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు టి.పద్మావతి, స్నేహలత, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాడిశెట్టి గంగాధర్, సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్ పాల్గొన్నారు. ఈ నెల 26న జరిగే కలెక్టరేట్ వద్ద కేంద్ర, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని యు.కొత్తపల్లి సిఐటియు కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.అప్పలస్వామి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ ధర్నాలో ప్రజాస్వామిక వాదులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవివి.సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, వి.గంగాధరరావు, సి.హెచ్.సాంబశివకుమార్, సూరిబాబు, విజయ్ పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్కీం వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆర్.నాగలక్ష్మి అధ్యక్షతన సిఐటియు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కీం వర్కర్లు, కార్మికులు, రైతులు, ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు వివిధ రంగాలకు చెందిన కార్మికులు పెరిగిన ధరలతో సతమతమవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు అమలు చేయడం లేదని, ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు అన్ని రంగాల కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు చంద్రమల్ల పద్మ, మిడ్డే మీల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఈశ్వరి, విఒఎ సంఘం నాయకులు కె.ఈశ్వరి బాయి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పెయ్యల అనంతలక్ష్మి, నామాడి మంగామణి, గుత్తుల శ్రీదేవి, నేరేడిమిల్లి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

చెత్త రహిత పట్టణమే లక్ష్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్వచ్ఛ పెద్దాపురంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చెత్త రహిత పట్టణం (జిఎఫ్‌సి), బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత (ఒడిఎఫ్‌ప్లస్) పట్టణంగా పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలను మున్సిపాలిటీ తీర్చిదిద్దుతుందన్నారు. చెత్తను ఆరుబయట వేయకుండా తడి- పొడి చెత్తలుగా విడదీసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఆరుబయట మల, మూత్ర విసర్జనకు పాల్పడకుండా మున్సిపాలిటీ పరిధిలోని కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్స్‌ని వినియోగించాలన్నారు. అందుకు పట్టణ ప్రజలంతా సహకరించాలనికోరారు. చెత్తను బయటపడవేసినా, ఆరుబయట మల, మూత్ర విసర్జన జరిపినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

చంద్రబాబుతో ఎంఎల్ఎ సత్యప్రభ భేటీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

చంద్రబాబుతో మాట్లాడుతున్న సత్యప్రభ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డుతో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైతాంగం పడుతున్న ఇబ్బందులను, గ్రామాల్లో రహదారులు దుస్థితితో పడుతున్న ఇబ్బందులను ఆమె చంద్రబాబుకు వివరించారు. వైసిపి ప్రభుత్వంలో ప్రత్తిపాడు నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురయిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించి సహకరించాలని కోరినట్లు ఎంఎల్ఎ తెలిపారు.

30వ రోజుకు క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

ధర్నాలో నినాదాలు చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

క్లాప్ వాహన డ్రైవర్లు మొదలుపెట్టిన ఆందోళన శనివారంతో 30 రోజుకు చేరుకుంది. 30వ రోజు ఆందోళనలో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద 30 నెంబర్‌ని సూచిస్తూ ఆకారంలో డ్రైవర్లు కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, క్లాప్ డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు సంతోష్ మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్ ప్రారంభించిన పోరాటం నేటికీ 30 రోజులు అవుతుందని, అయినా డ్రైవర్లకు జీతం వేయించడంలో అధికారులు విఫలమయ్యా రన్నారు. శనివారం కాంట్రాక్టర్ తాలూకు వ్యక్తి ఫోన్ చేసి క్లాప్ డ్రైవర్ల జీతాలు రెండు రోజుల్లో పడతాయని ఆందోళన విరమించాలని కోరారని తెలిపారు. జీతాలు వేసిన తర్వాతే ఆందోళన విరమిస్తామని స్పష్టం చేశారు. జీతాలతో పాటు ఐడెంటి కార్డులు, కట్ చేసుకున్న పిఎఫ్ సొమ్ము ఖాతాకు జమ చేసే విధంగా చర్యలు తీసుకున్నాక మాత్రమే ఆందోళన విరమించే విషయంపై ఆలోచన చేస్తామన్నారు. మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి జీతాలు వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, గంగాధర్, భద్ర, దుర్గాప్రసాద్, శివ, వెంకటేష్, దుర్గబాబు, టి శ్రీను, రమణ, రాజు, శివ పాల్గొన్నారు.

సబ్ ప్లాన్ గ్రామాల్లో ఎస్‌టి కమిషన్ పర్యటన

ప్రజాశక్తి - రౌతులపూడి

గిరిజనుల సమస్యలను వింటున్న ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

మండలంలోని సబ్ ప్లాన్ గిరిజన గ్రామాల్లో ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ శనివారం పర్యటించారు. మండలంలో చెల్లూరు నుంచి గిన్నెలారం వరకూ సుమారు 6 కిలోమీటర్ల మేరకు కాలి నడకన వెళ్లి గిరిజనులను కలుసుకున్నారు. ఈ గ్రామంలో పెద్దూరు, గిన్నెలారం గ్రామాల గిరిజనులతో ఆయన భేటీ అయ్యారు. ప్రభుత్వ అందిస్తున్న పథకాలను అమలు తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గిరిజనులు రహదారులు నిర్మాణం చేయాలని, విద్య, వైద్యం, విద్యుత్, కుల ధృవీకరణ పత్రాల మంజూరులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషన్‌ను కోరారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు అనారోగ్యాలకు గురైయిన సందర్భంలో డోలుపైనే ఆధారపడి ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ రెండు నెలలకోసారి గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అఖిలభారత ఆదివాసుల సంఘం ఆధ్వర్యంలో సబ ప్లాన్ ఏజెన్సీ ప్రాంతంలో విద్యార్థులకు జూనియర్ కళాశాల ఏర్పాటు, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, 59 గిరిజన గ్రామాలను ఐటిడిఎలో విలీనం చేయాలని కోరారు. సబ్ ప్లాన్ ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రత్యేక అలవెన్స్ మంజూరుతో పాటు, జిల్లా కేంద్రంలో గిరిజన భవనం నిర్మాణం నిర్మించాలని అఖిలభారత ఆదివాసి ఉద్యోగుల సంఘం నాయకులు గంటిమల సత్తిబాబు వినతిపత్రాన్ని అందజేశారు. తొలుత రౌతులపూడి శివారులో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి, తహశీల్దార్ పోతురాజు, ఎంపిడిఒ శివరామకృష్ణయ్య, గిరిజన నాయకులు పి.వరహాలు, ఈగల సత్తిబాబు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్

ప్రజాశక్తి - శంఖవరం

స్కాలర్‌షిప్‌ను అందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభను చాటుకున్న నలుగురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను అంజేశారు. శనివారం సత్యదేవ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో నార్త్ ఆంధ్ర ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఛైర్మన్ ఎన్‌విఎన్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.6 వేలు చొప్పున స్కాలర్‌షిప్‌తోపాటు, సర్టిఫికెట్స్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు పాతకాలపు చదువులకు స్వస్తి పలికి ప్రస్తుత జీవన శైలికి అనుగుణంగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, కొల్లూరి అప్పలరాజు మంచి జగన్నాథం, సత్యదేవ లైన్స్ క్లబ్ ప్రతినిధులు డొంకాడ గిరి, సత్యనారాయణ, పి.సూరిబాబు, ప్రిన్సిపల్ బి.అరుణకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో అదనపు జడ్జి పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

పూజలో పాల్గొన్న న్యాయమూర్తి దంపతులు

భీమేశ్వరాలయంలో గుంటూరు జిల్లా అదనపు జడ్జి శరత్‌బాబు దంపతులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు, వేద పండితులు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జీడిపిక్కల ఫ్యాక్టరీని తెరిపించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ర్యాలీ నిర్వహిస్తున్న ఫ్యాక్టరీ కార్మికులు

ఈనెల 16వ తేదీన అర్థాంతరంగా మూసివేసిన జీడి పిక్కల ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని సిఐటియు మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మూతపడ్డ ఫ్యాక్టరీ ఎదుట గత 8 రోజులుగా కార్మికులు ధర్నాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఆయన కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 409 మంది కార్మికులు పనిచేస్తున్న జీడిపిక్కలు ఫ్యాక్టరీని యాజమాన్యం అర్థాంతరంగా మూసివేయటంతో రోడ్డున పడ్డారని అన్నారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ప్రతి కార్మికునికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున ఫ్యాక్టరీలు తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తామని చెబుతుందన్నారు. అయితే 409 మంది కార్మికులు పనిచేస్తున్న ఫ్యాక్టరీని మూసివేస్తే నేటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం యాజమాన్యంతో చర్చించి వెంటనే ఫ్యాక్టరీ తెరిపించాలని, లేని పక్షంలో ఫ్యాక్టరీని ప్రభుత్వ స్వాధీనం చేసుకుని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికులు ర్యాలీ నిర్వహించి ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు అనిశెట్టి వీరబాబు, వి.రాజేష్, గంగరాజు, చక్రధర్, దుర్గాప్రసాద్, వి.వీరబాబు, ఎస్.జయలక్ష్మి, వై.శివవరలక్ష్మి, కె.కృష్ణవేణి పాల్గొన్నారు. .

కుటుంబ సభ్యులను కలుసుకున్న బాధితురాలు

ఇంటికి చేరిన కువైట్ బాధితురాలు

ప్రజాశక్తి - గండేపల్లి

బతుకు తెరువు కోసం కువైట్ వెళ్లి అక్కడ చిత్రహింసలకు గురైన మండలంలోని యల్లమిల్లి గ్రామానికి చెందిన గారా కుమారి రాష్ట్ర ప్రభుత్వ చొరవతో శుక్రవరం సురక్షితంగా ఇంటికి చేరింది. భర్త చనిపోయి, ఇళ్లు గడవడం కష్టమైన పరిస్థితులల్లో తన ముగ్గురు పిల్లల పోషణ, భవిష్యత్తు కోసం ఆమె పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఏజెంట్ ఎం.సుధాకర్ ద్వారా ఈ ఏడాది మే నెలలో కువైట్ వెళ్లింది. రూ.30 వేల జీతంతో ఇంటి పనులు చేసేందుకు ఉద్యోగంలో చేరింది. తాను పనిచేసే యజమాని చిత్రహింసలకు గురిచేయడంతో ఇబ్బందులు పడింది. ఆ ఇబ్బందులు భరించలేక ఒక వీడియో చేసి ఆమె సోదరుడు కర్రిపోతు సూర్య చంద్రకు పంపించింది. ఆ వీడియోను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్‌ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు స్పందించి భారత రాయభార కార్యాలయంతో సంప్రదించి ఆమెను తిరిగి స్వదేశానికి వచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆమె కువైట్ నుంచి హైదరాబాద్‌కు చేరుకుని, శనివారం తెల్లవారుజామున తన స్వగ్రామం యల్లమిల్లికి చేరుకుంది. తన కుటుంబానికి కొండంత అండగా నిలిచిన పవన్‌కళ్యాణ్, నారా లోకేష్, కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికలపై విద్యార్థులతో మాక్ పోలింగ్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మాక్ పోలింగ్‌లో ఓటు వేస్తున్న విద్యార్థులు

ఎన్నికల నియమావళి ప్రక్రియపై విద్యార్థులందరికీ అవగాహన కలిగించే లక్ష్యంతో స్థానిక జడ్‌పి బాలికోన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని శనివారం నిర్వహించిన ఈ మాక్ పోలింగ్‌లో ఎపిఒ, ఒపిఒ, పిఒ, ఏజెంట్లును నియమించారు. స్ట్రాంగ్ రూముల్లో బ్యాలెట్ బాక్స్‌ను భద్రపరిచి అనంతరం కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చింతకాయల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు కె.యామినిప్రసాద్ కె.సబిత, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాహుల్ మీనా

క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో డిఆర్ఒ జె.వెంకటరావుతో కలిసి డివిజన్ స్థాయి అధికారులు, తహశీల్దార్లు, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. భూసేకరణ పనులు, పిజిఆర్ఎస్ అర్జీలు, నగర వనం, స్మశాన వాటికలు, డంపింగ్ యార్డులకు స్థలం గుర్తింపు, రీ సర్వే గ్రామసభల నిర్వహణ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణ పనులకు సంబంధించి ఆటంకం లేకుండా వేమగిరి, తీపర్రు దగ్గర రెండు ఇసుక రీచ్చులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలు మూడు ప్రాంతాల్లో ఇసుక స్టాక్ పాయింట్ల నిర్వహణకు అవసరమైన ఏజెన్సీలను ఇప్పటికే గుర్తించడం జరిగిందని, త్వరలో ఇసుక స్టాక్ పాయింట్లు నుంచి కూడా ఇసుక బుక్ చేసుకోవచ్చునని అన్నారు. జాతీయ రహదారి పనులకు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేసి, పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన అర్జీలపై శ్రద్ధ వహించాలన్నారు. నగర వనం, స్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు ఏర్పాటుకు ప్రభుత్వ భూములు గుర్తించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ముమ్మరంగా మొదలయ్యాయని, ధాన్యం కొనుగోలు నిమిత్తం జిల్లాలో 277 రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగిందన్నారు. క్షేత్రసాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, ఎన్‌హెచ్ఎఐ పీడీ డి.బెనర్జీ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య డిగ్రీ, పీజీ కళశాల, ఫోరెన్సిక్ సైన్స్ విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హానికరమైన ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బికె.విద్యాసాగర్, ప్రిన్సిపల్ విలాస్ అనిల్‌చవాన్, వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

నూతన పింఛన్ విధానంపై అవగాహన

ప్రజాశక్తి - కాజులూరు

ప్రభుత్వం ప్రకటించిన నూతన పింఛన్ విధానంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ జె.రాంబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం నూతన పాలసీని తీసుకొచ్చిందన్నారు. గతంలో ఏ నెల పింఛన్‌ను ఆ నెలలోనే తీసుకోవాల్సివచ్చేదని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీసుకున్న నూతన పాలసీ ద్వారా ఒక నెలలో అనివార్య కారణాల వల్ల పింఛన్ తీసుకోకపోయినా మరుసటి నెలలోనైనా లేదంటే మూడు నెలలకోసారి తీసుకోవచ్చునని అన్నారు. సచివాలయ పరిధిలో వారం రోజుల పాటు క్షేత్రస్థాయి సిబ్బందితో అవగాహన కల్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక పాండవుల మెట్ట విద్యుత్ సబ్ స్టేషన్ 33 కె.వి లైన్‌పై మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో 11 కెవి ఎడిబి రోడ్డు, 11 కెవి హౌసింగ్ కాలనీ ఫీడర్స్‌పై ఉన్న ఇండస్ట్రియల్ వినియోగదారులకు, ఆనూరు 11 కెవిపై ఉన్న అగ్రికల్చర్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

నేరాలు ఘోరాలు

మీడియాతో మాట్లాడుతున్న డిఎస్‌పి ప్రసాద్

ఆయిల్ చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - అమలాపురం

ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామంలో ఒఎన్‌జిసి వెల్ నుంచి ఆయిల్ దొంగతనం చేస్తున్న ఇద్దరు వ్యక్తులతోపాటు, దొంగిలించిన ఆయిల్‌ను విక్రయాలు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సిఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి టిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ వివరాలను వెల్లడించారు. ఉప్పలగుప్తం మండలం గోపవరంలో వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో నిందితులను ఉప్పలగుప్తం పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. దొంగిలించిన వైట్ ఆయిల్ లీటరు రూ.50కు కొనుగోలు చేసి రూ.80 విక్రయిస్తున్నారని తెలిపారు. నిందితులు ఒఎన్‌జిసి వెల్‌కు పైపులైను బిగించి దాని ద్వారా ప్లాస్టిక్ టిన్నులోకి వైట్ ఆయిల్ చోరీ చేస్తున్నారని అన్నారు. నిందితులు 5 నెలలుగా నెలకు 3 సార్లు వైట్ ఆయిల్‌ను దొంగిలిస్తున్నట్లు విచారణలో గుర్తించినట్లు తెలిపారు. చోరీ చేసే సమయంలో ఆయిల్ ప్రెజర్‌కు నాబ్ ఊడిపోయి పెద్ద శబ్దం రావడంతో నిందితులు పారిపోయినట్లు తెలిపారు. నిందితుల నుంచి నెంబర్ ప్లేటు లేని ద్విచక్ర వాహనం, 10 లీటర్ల వైట్ ఆయిల్, ఆయిల్ చౌర్యానికి వినియోగించిన ప్లాస్టిక్ డబ్బాలు, పైపులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసులో నిందితులను చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేసిన అమలాపురం రూరల్ ఇన్‌ఛార్జ్ సిఐ పి.వీరబాబు, ఉప్పలగుప్తం ఎస్ఐ సిహెచ్.రాజేష్, సిబ్బందిని జిల్లా ఎస్‌పి కృష్ణారావు ప్రత్యేకంగా అందించారనీ డిఎస్‌పి తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

యువతి అదృశ్యంపై శుక్రవారం గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందిన ఆర్మీ మాజీ ఉద్యోగి గుండు శ్రీనివాసరావు కుమార్తె చైతన్య దుర్గ కాంపిటీషన్ ఎగ్జామ్స్ నిమిత్తం కొంతకాలంగా హైదరాబాదులో ఒక కోచింగ్ సెంటర్లో శిక్షణ పొందు తోంది. ఈ నేపథ్యంలో అదే కోచింగ్ సెంటర్‌లో గల ఒక అబ్బాయితో చైతన్య దుర్గ సన్నిహితంగా ఉంటోంది. విషయం తెలుసుకున్న తండ్రి శ్రీనివాసరావు కుమార్తెను మందలించి ఇటీవల హైదరాబాదు నుంచి స్వగ్రామం తీసుకుని వచ్చాడు. అప్పటి నుంచి ఆ యువతి ఇంటి దగ్గరే ఉంటుంది. ఈ నేపథ్యంలోనే శ్రీనివాసరావు తోడల్లుడు అనారోగ్యంగా ఉండడంతో ఈ నెల 10న తన భార్య కుమార్తెను గొల్లప్రోలుకు పంపించాడు. బంధువులు ఇంటి వద్ద మూడు రోజులు పాటు ఉన్న చైతన్య దుర్గ ఈనెల 14వ తేదీ తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోయింది. ఉదయం చూసేసరికి చైతన్య దుర్గ కనిపించలేదు. కుమార్తె కోసం బంధువులు తెలిసున్న వారి ఇంటి వద్ద వెతికినప్పటికీ ఫలితం కనిపించకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శనివారం నిర్వహించిన దాడుల్లో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు, 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జున్‌రావు తెలిపారు. గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊట ను ధ్వంసం చేశామన్నారు. ఎర్రంపాలెం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నిలవజేసిన 10 డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

ప్రజాశక్తి - పిఠాపురం

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 23 మందికి జరిమానా విధించినట్లు సిఐ జి.శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రవ్ తనిఖీల్లో 23 మందిని అదుపులోకి తీసుకుని పిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ విజయ రామేశ్వరి వారికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారని అన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కోళ్లు, మేకలు, సెల్ ఫోన్లు దొంగతనాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం...గోకవరం గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ మండలంలో దొంగతనాలకు పాల్పడుతుండగా తనకి వచ్చిన సమాచారం మేరకు రామవరం గ్రామ శివారున ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతని వద్ద నుంచి సుమారు రూ.70 వేలు విలువైన 4 కోళ్లు, ఒక యునికార్న్ బండి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ముద్దాయిని కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

150 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

యానం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న కోరంగి పంచాయతీ చిన బొడ్డు వెంకటాయపాలెంకు చెందిన పెసింగి వీరబాబును అదుపులోకి తీసుకుని, అతని నుంచి 150 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కె.కోటేశ్వర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ నాగేంద్రకృష్ణ, హెచ్‌సి వెంకటేశ్వరరావు, పిసి విష్ణు పాల్గొన్నారు.

గంజాయితో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - దేవరపల్లి

గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రానికి చెందిన అమల్ కృష్ణ, మహమ్మద్ సాహుల్, సాహిల్ మొన్, అభినవ్ పునతిల్, రెండు మోటార్ సైకిళ్లపై మూడు బ్యాగ్‌లలో తరలిస్తున్న 40.550 కేజీల గంజాయి, బైకులను స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలిస్తున్నామని సిఐ బి.నాగేశ్వర్ నాయక్ శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు.

కొండ దిగనంటున్న కూరగాయలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కార్తీక మాసం చివరిలోనూ కూరగాయల ధరలు కొండదిగనంటున్నాయి. గత నెల రోజులుగా ధరలు ఆకాశాన్నంటుతూనే ఉన్నాయి. టమోటా రూ.50 చొప్పున, కిలో మిచ్చి రూ.80 చొప్పున కొనుగోలుదారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చిక్కుడు కాయలు సైతం కిలో రూ.80 మార్కు దిగిరానంటున్నాయి. ఉల్లి ధరలు కేజీ రూ.70కి చేరాయి. టమోటా, ఉల్లిపాయలు ఈ రెండింటిలో ఏది ధర పెరిగినా వంట గదిలో రోజు గడవటం కష్టమే. అటువంటి ఈ ధరలు నెల రోజులుగా ఆకాశాన్నంటంటతో సామాన్యులకు కంటి మీద కునుకు కరువైంది. ఇక ఇతర కూరగాయలు సైతం కిలో రూ.50 పైమాటే. మరోవైపు నిత్యావసర సరుకుల ధరలూ నింగిని తాకుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 6 నెలలు గడిచింది. ధరల నియంత్రణకు చేపట్టిన చర్యలు శూన్యమని స్పష్టమవుతోంది. మరోవైపు పప్పుల ధరలు నింగిని తాకుతున్నాయి. నూనెల ధరలూ పోటీపడుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా ధరలు నియంత్రణకు చర్యలు చేపట్టకకపోతే ప్రజాగ్రహానికి గురికాకతప్పదనే అభిప్రాయ వ్యక్తమవుతోంది..

ప్రహసనంలా ధాన్యం కొనుగోలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రహసనంలా మారింది. ప్రతి సీజన్‌లోనూ పాలనా యంత్రాంగం చిత్తశుద్ధి లోపం రైతులను నట్టేట ముంచుతోంది. ఈ ఏడాదీ నత్తనడకన కొనుగోలు జరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4.50లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఇప్పటి వరకూ 45 శాతం కోతలు పూర్తయినా ప్రభుత్వ కొనుగోలు లక్ష్యానికి పొంతనే లేదు. మరోవైపు మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా గాలిలో తేమ శాతం పెరిగింది. దీంతో ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాలలో తేమ శాతం నిబంధనలు ప్రధాన అడ్డంకిగా మారినట్లు

రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో 75 కేజీల బస్తాకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1630 కాగా రూ.1300 నుంచి రూ.1500 చొప్పున దళారులకు విక్రయిస్తున్నారు. ఆర్థికంగా నష్టపోతున్నారు. బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు అధికంగా ఉన్నప్పటికీ రైతులకు మద్దతు ధర లభించడం లేదు.

చలి పులి

రోజు రోజుకి చలి తీవ్రత పెరుగుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు 21 నుంచి 22 డిగ్రీల సెల్సియస్ మధ్యలో నమోదవుతోంది. 15 రోజుల క్రితం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల వరకు ఉండగా, వారం రోజుల్లో గణనీయంగా పడిపోయాయి. మరో వైపు ఉదయం వేళల్లో పొగ మంచు కమ్మేస్తోంది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా నవంబరు మొదటి వారం నుంచే చలి పెరుగుతుంది. గడిచిన నెల రోజులుగా క్రమ క్రమంగా చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం వేళల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువైంది. ఈ నేపథ్యంలో శ్వాసకోస వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జ్వర పీడితుల సంఖ్య క్రమ క్రమంగా పెరగటంతో ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రులలో ఓపీల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

పోరుబాటలో ఉద్యోగ, కార్మిక వర్గాలు

తమ సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఉద్యోగులు, కార్మికులు పోరుబాట పట్టారు. 108 ఉద్యోగులు ఈ నెల 25నుంచి సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేసిన విషయం విధితమే. ప్రభుత్వ నిర్లక్ష్యం సామాన్యులకు వైద్య సేవలు దూరం కానున్నాయి. అదే విధంగా ఆశా వర్కర్లు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్లు దద్దరిల్లాయి. ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనలు మరింత తీవ్ర రూపం దాల్చే పరిస్థితులు నెలకొన్నాయి.

అధిక సంఖ్యలో వ్రతాలు నిర్వహిస్తున్న యాత్రికులు

సత్యదేవుని జన్మ నక్షత్ర వేడుకలు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యదేవుని జన్మ నక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం వేకువ జామున స్వామి వారి ప్రధాన ఆలయంలో అర్చకులు మూలవరులకు ప్రత్యేక అభిషేకాలు, వైదిక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు రావడంతో దర్శనం క్యూ లైన్లలో రద్దీ ఏర్పడింది. సుమారు నాలుగువేల వ్రతాలు నిర్వహించుకున్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంతో దేవస్థానం ఛైర్మన్ ఐవి.రోహిత్ పాల్గొన్నారు. ముందుగా 27 రోజులపాటు సత్య దీక్ష చేపట్టిన దీక్షపరులు ఇరుముడులు స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా సత్యదీక్షపరులకు ఉచితంగా వ్రతాలు నిర్వహించగా, భక్తులకు పులిహార, దద్దోజనం పంపిణీ చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

20 శాతం మార్జిన్ ఇప్పించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

మద్యంపై ప్రభుత్వం ముందుగా చెప్పినట్లు 20 శాతం మార్జిన్‌ను ఇవ్వాలని మద్యం లైసెన్సుదారులు కోరారు. శనివారం పలువురు లైసెన్స్‌దారులు పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నూతన మద్యం పాలసీలో ప్రభుత్వం తెలిపిన విధంగా 20 శాతం మార్జిన్ కాకుండా కేవలం 10 శాతం మార్జిన్ మాత్రమే ప్రస్తుతం ఇస్తోందన్నారు. ఈ మార్జిన్ వల్ల లైసెన్స్‌దారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. లైసెన్స్ ఫీజు, షాప్ రూమ్ బాడిగలు, సేల్స్‌మేన్ జీతాలు, ఐఎంఎల్ డిపో నుంచి సరుకు కొనుగోలు తదితర ఖర్చులన్నీ పరిగణలోకి తీసుకొని ఏ4 లైసెన్స్ దారులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గత నెల అక్టోబర్ 16 నుంచి ఇప్పటి వరకు కొనుగోలు చేసిన

జనసేన ఇన్‌ఛార్జ్‌కి వినతిపత్రం ఇస్తున్న మద్యం లైసెన్స్‌దారులు

మద్యంపై 20 శాతం మార్జిన్‌తో పాటు ప్రస్తుతం కొనుగోలపై 20 శాతం మార్జిన్ వచ్చేటట్లు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బస్వా దుర్గాప్రసాద్, బస్వా చిట్టిబాబు, పివి.పద్మనాభ రెడ్డి, పుల్లా రామకృష్ణ, వుటా రామకృష్ణ, కొట్టేటి రాజేష్, గాజుల మణి, ముమ్మిడి సతీష్ పాల్గొన్నారు.

యాంటీబయోటిక్స్‌తో ప్రమాదం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆక్వా కల్చర్ లో యాంటీబయాటిక్స్ నిరోధించకపోతే మానవ మనుగడకే పెను ప్రమాదమని సిఐఎఫ్ఇ సీనియర్ సైంటిస్ట్ పి.మురళీధర్, నక్స రీజినల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం తాళ్లరేవు లయన్స్ క్లబ్‌లో పలు సొసైటీల రొయ్య రైతులు, ఆక్వా రైతులకు నక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు ఆఫ్ లైన్, ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. రొయ్యల పంటలో ఉపయోగించే యాంటీబయాటిక్స్ అవశేషాలు మనుషుల రక్తంలో కలిసిపోయి పలువురు అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. యాంటీ

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

మైక్రోబియల్ నిరోధకత, ఆక్వా కల్చర్‌లోఉపయోగించే యాజమాన్య పద్ధతులపై సిఐఎ డైరెక్టర్ శంకరరావు ఆన్ లైన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. మత్స్య శాఖ ఎడి ఎం.లావణ్య, నక్ష అధికారులు ఎంపి.చంద్రశేఖర్, స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎస్.బాలాజీ, ఎస్ఎల్.రాజేష్, ఆదర్శ రైతు కొల్లు వెంకటేశ్వరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఫార్మసీకి విదేశాల్లో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఫార్మసీ రంగానికి విదేశాల్లో ఉన్నత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జెఎన్‌టియుకె సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ పిన్నమనేని ఉదయభాస్కర్ తెలిపారు. శనివారం కోరంగి ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరోపియన్, అమెరికా వంటి దేశాల్లో వైద్యుల కంటే ఫార్మసిస్టులకే ఎక్కువ ప్రాధాన్యత ఉందని తెలిపారు. విద్యార్థులు ఫార్మసీ రంగంలో ప్రతిభ సాధించడం ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోగలరని ఆకాంక్షించారు. కోరంగి ఫార్మసీ కళాశాల నుంచి తాళ్ళరేవు సంతపేట సెంటర్ వరకూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ పి.కనక రాజు, డైరెక్టర్లు చిట్టూరి కలికిమూర్తి, పి.నాగమణి, ప్రిన్సిపల్ సువర్ణజ్యోతి, ఎఒ మాల పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉదయభాస్కర్

జార్ఖండ్‌లో ఇండియా కూటమి విజయంపై సంబరాలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

జార్ఖండ్‌లో ఇండియా కూటమి విజయంపై సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. శనివారం స్థానిక లిబరేషన్ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారురాజు మాట్లాడుతూ జార్ఖండ్ లో సింద్రీ, నిరస నియోజకవర్గాల నుంచి సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ అభ్యర్థులు భారీ మోజారిటీతో విజయం సాధించారని అన్నారు. ఈ ఎన్నికల్లో జార్ఖండ్ రాష్ట్ర ప్రజలు మతొన్మాద బిజెపికి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఇండియా కూటమి తరుపున లిబరేషన్ తరుపున ముగ్గురు పోటీ చేశారని, వారిలో ఇద్దరు భారీ ఆధిక్యంతో విజయం సాధించడం పట్ల ఆయన ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మానుకొండ లోవమ్మ, పిల్ల ప్రభుదాసు, నేతల రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న లిబరేషన్ నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ముదునూరి

నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రోజు రోజుకీ పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు డిమాండ్ చేశారు. శనివారం మండలంలో వెంకటనగరం, ధర్మవరం గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించారు. వెంకటనగరానికి చెందిన ముప్పిడి అప్పలకొండ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకోవడంతో ఆయనను పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు వలస పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు దాటిన ఇసుకను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి నూకరాజు, బొల్లు నాగేశ్వరరావు, మాగాపు శివ పాల్గొన్నారు.

బాబ్జి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి నాయకుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం వైసిపి నాయకులు గంగుల బాబ్జి (45) ఇటీవల ఆకస్మికంగా ధుర్మరణం చెందారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న వైసిపి రాష్ట్ర నాయకులు చింతలపాటి శ్రీనివాసరాజు శనివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతిని భార్యకు రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు అందరూ అండగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకటశివరామప్రసాద్, ఎంపిటిసి సభ్యులు గుత్తుల శ్రీనివాస్, మోర్త బీమాబాయి, నాయకులు కాశి లక్ష్మణస్వామి, పెయ్యల కొండబాబు, కోరుకొండ చంటి, బొంతు సత్యనారాయణ పాల్గొన్నారు.

సెలక్షన్స్‌ను ప్రారంభిస్తున్న ఆదిత్య నిర్వాహకులు

'ఆదిత్య' క్రికెట్ టీమ్ ఎంపిక

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం 2024-2025కి సంబంధించిన క్రికెట్ టీం ఎంపికైంది. శనివారం నిర్వహించిన సెలక్షన్స్‌ని డిప్యూటీ ప్రో ఛాన్సిలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఆల్ రౌండర్ క్యాటగిరీలు పరీక్షించి మేలైన ప్రదర్శన చేసిన వారిని ఎంపిక చేసినట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి డాక్టర్ ఎస్.రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సిలర్ డాక్టర్ ఎస్.రమశ్రీ, డీన్ ప్రొఫెసర్ వి. సత్యనారాయణ , స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ త్రిపాఠి, ఫిజికల్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

సందడిగా వికలాంగుల కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మానసిక వికలాంగ విద్యార్థుల కార్తీక వనసమారాధన ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. స్థానిక ఉమా మనో వికాస కేంద్రం ఆధ్వర్యంలో ఉన్న వికలాంగుల కేంద్రం విద్యార్థులు శనివారం జామకాయల తూము సెంటర్‌లో ఉన్న గ్రీన్ వాలీలో ఆటపాటలతో గడిపారు. చిన్నారులకు మ్యూజికల్ ఛైర్, లెమన్ అండ్ స్పూన్, డాన్స్, పరుగు పందాలు నిర్వహించినట్లు నిర్వాహకులు గోపాల్ తెలిపారు. పోటీలలో గెలుపొందిన చిన్నారులకు ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 3న బహుమతులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, సత్తిబాబు, సిబ్బంది స్టీఫెన్, ఉదయకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ సెక్యూరిటీ అండ్ ఉమెన్ ఎంపవర్మెంట్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిఐ వైఆర్‌కె.శ్రీనివాసరావు, ఎస్ఐ శివనాగు పాల్గొని రోడ్డు భద్రత నియమాలు, సైబర్ సెక్యూరిటీ, ఉమెన్ ఎంపవర్మెంట్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, అడ్మినిస్ట్రేషన్ డీన్ డాక్టర్ వైకెఎస్.సుబ్బారావు, డీన్ ఐక్యూఎసి డాక్టర్ సంజీవ్‌రావు, డీన్ కెరీర్ గైడెన్స్ డాక్టర్ డి.కిషోర్ పాల్గొన్నారు.

వల్లభ స్వామికి రూ.3.86 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ రూపాల్లో రూ.3.86 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,61,570, అన్నదాన విరాళాల ద్వారా రూ.72,748, కేశఖండన ద్వారా రూ.6,400, తులా భారం ద్వారా రూ.300, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.45,180 వెరసి రూ.3,86,198 ఆదాయం లభించిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు సేవలందించారు.

వనసమారాధనకు కుడుపూడి విరాళం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో జరగనున్న ఉభయ తెలుగు రాష్ట్రాల కార్తీక వన సమారాధనకు ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ మేరకు విజయవాడలో మంత్రి సుభాష్‌ను కలిసి శివన్నారాయణ మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న శెట్టిబలిజలను అధిక స్థాయిలో సమీకరించి వన సమారాధన విజయవంతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ శెట్టిబలిజ, ఎస్ఎఎఫ్ నాయకులు విఎస్.మూర్తి, రెడ్డి శివాజీ, బొంతు శ్రీనువాస్, చిట్టూరి విజయ్ పాల్గొన్నారు.

శరవేగంగా సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని పలు గ్రామాల్లో టిడిపి సభ్యత్వ నమోదు శరవేగంగా జరుగుతుందని పెద్దాపురం ఐటిడిపి ఇన్‌ఛార్జ్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ రేలంగి వెంకట్రావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని తిరుపతి గ్రామంలో శనివారం సభ్యత్వ నమోదును చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ సైన్స్ సెంటర్లో శనివారం సామర్లకోట ఐఐటి కాన్సెప్ట్ స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు ప్రాక్టి కల్స్ పై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వా హకులు బుద్ధా శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ప్రాక్టికల్స్ అవగాహనలో విద్యార్థులకు లోహాలు, అలోహాల భౌతిక లక్షణాలు, కంటి అనాటమీ, ప్రిజం ద్వారా వక్రీభవనం, మూలకాల ఎలక్ట్రాన్ కాన్ఫిగరేషన్‌పై విద్యార్థులతో ప్రయోగాలు చేయించారు. ఈ ప్రయోగాల నిర్వహణలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు.

ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు

ఆలయంలో కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - సామర్లకోట

పెద్దాపురం రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో కార్తీక సమారాధాన కార్యక్రమం శనివారం జరిగింది. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు అయోధ్యుల పద్మ రాజేంద్రకుమార్, రాజేంద్ర రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత పాండురంగ స్వామికి, అమ్మవారికి పంచామృతాభిషేకలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

సమారాధనలో పాల్గొన్న ప్రజలు

మండల అభివృద్ధికి కృషి చేస్తా : ఎంపిపి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖలకు సంబంధించిన పనుల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శివరామకృష్ణయ్య, ఎంపిటిసి సభ్యులు సోమరౌతు రవి, రాజు, ఎస్.నాని, డాక్టర్ పావని, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సమస్యపై చర్చలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గాడిమొగ పంచాయతీ బాబానగర్ శ్మశాన వాటికకు కలెక్టర్ 50 సెంట్లు స్థలాన్ని కేటాయించారు. ఆ భూమిలో స్మశాన వాటికి తగదని గాడిమొగకు చెందిన ఒకవర్గం వ్యతిరేకించింది. దీంతో శనివారం ఇరు వర్గాలతో తహశీల్దార్ పి.త్రినాధరావు చర్చలు జరిపారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రజలంతా సామరస్యం పాటించాలని, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాడి మొగ, బాబా నగర్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సత్యసాయి 99వ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయ భూపాలపట్నంలో శనివారం సత్య సాయి 99వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత నగర సంకీర్తనతో ప్రారంభమైన ఈ వేడుకల్లో భాగంగా మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సేఫ్టీ ఆఫీసర్ కావలెను

సేఫ్టీ ఆఫీసర్ :
ఫ్యాక్టరీల చట్టం 1948లోని సెక్షన్ 40(బి) మరియు AP ఫ్యాక్టరీస్ రూల్స్ 1950లోని 61(ఎ) ప్రకారం మేము మా ఫ్యాక్టరీ కోసం సేఫ్టీ ఆఫీసర్ పోస్ట్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాము.

అర్హతలు / అనుభవం :
1) డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆంధ్రప్రదేశ్ ద్వారా చట్టం ప్రకారం గుర్తించబడిన RLI / రాష్ట్ర టెక్నికల్ బోర్డు - AP నుండి ఇండస్ట్రియల్ సేఫ్టీ డిప్లమా.
2) ఏదైనా ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో గుర్తింపు పొందిన ఫుల్ టైం డిగ్రీ / డిప్లమా లేదా సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ మరియు సంబంధిత అనుభవం కలిగి ఉండాలి.
3) అభ్యర్థి తప్పనిసరిగా స్థానిక భాషలో ప్రావీణ్యం కలిగి ఉండాలి

ఆసక్తి గల అభ్యర్థులు ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోపు కవరు పై భాగమున "సేఫ్టీ ఆఫీసర్ పోస్ట్ కోసం దరఖాస్తు" అని సూచిస్తూ దరఖాస్తు చేయవలెను.

ADITYA BIRLA GRASIM
హ్యూమన్ రిసోర్సెస్ విభాగము
గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ - కెమికల్ డివిజన్
సర్వే 1-4, కనేడుమెట్ట, బలభద్రపురం గ్రామం, బిక్కవోలు మండలం.
తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ - 533 343.
ఈ-మెయిల్ : recruitment.bbpuram@adityabirla.com

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో (సీనియర్ డివిజన్)
ఇ.పి. నెం. 65/2017
ఓ.యస్. నెం. 305/2008

డి. హెచ్. ఆర్./పిటీషనరు/ వాది:
శ్రీమతి కొనిజేటి నాగమణి, భర్త: వెంకట సుబ్బారావు, స్త్రీ, గృహిణి, వయస్సు 62 సం॥లు, డోరు నెం. 7-1-8/1, గణపతి సెంటర్, నిడదవోలు (గ్రామము/ మండలము)

జె.డి. ఆర్‌లు/ రెస్పాండెంట్లు/ ప్రతివాదులు:
(1) గుంటూరు సామ్రాజ్యం (లేటు)
(2) గుంటూరు సత్యన్నారాయణరెడ్డి
(3) శ్రీనివాసుల రెడ్డి

To:
4వ జెడిఆర్: గుంటూరు తిరుమలరెడ్డి, తండ్రి: సత్యన్నారాయణరెడ్డి, పురుషుడు, ప్రైవేటు ఉద్యోగి, వయస్సు 46 సం॥లు, కుమ్మర్ల వీధి, నిడదవోలు (గ్రామము / మండలము)

పై నెంబరు ఇ.పి. పిటీషన్‌లో 4వ జెడిఆర్ కు శ్రీ కోర్టు మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా ఎన్నిసార్లు సేల్ నోటీసులు పంపించిననూ 4వ జెడిఆర్ సేల్ నోటీసులు పంపించిననూ 4వ జెడిఆర్ సేల్ నోటీసులు తీసుకొని యుండలేదు. కాబట్టి పై నెంబరు ఇ.పి. పిటీషన్‌లో 4వ జెడిఆర్‌కు ఎటువంటి ఆక్షేపణలు ఉన్ననూ పై కోర్టు వారి ఎదుట **ది. 06-12-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున ఇ.పి. పిటీషను తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

ఎస్.సుబ్బారావు
కొవ్వూరు — అడ్వకేటు, కొవ్వూరు
ది.16-11-24 — సెల్: 9492917811

పత్రికా ప్రకటన
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

In the Court of the Senior Civil Judge, Ramachandrapuram
E.A. No. 77/2023 in EPSR No. 87/2023 in O.S. No. 117/2018

Between:
Yalamati Rama Rao ...*Petitioner/ DHr*
AND
Chitturi Seshavataram (died) & Others
...*Respondents/ Proposed Parties/ JDrs*

3rd Respondent/ Proposed Party:
Katturi Kumari, D/o. late Ramarao, age 40 years, Occ: House wife, C/o. Ch.Satyanarayana, D.No. 2-10/2, Kondapallivari Veedhi, R/o. Mandapeta, Mandapeta Mandal, Alamuru PJCJ.

పై నెంబర్ గ్రంథంలో పై Chitturi Seshavataram చనిపోగా అతని యొక్క ముఖ్య వారసులుగా చేరిపించమని పై వాది/ పిటీషనరు పై నెంబరు గ్రంథంలో పై వాది పరిహారం నిమిత్తం పై కోర్టులో మీపై E.A. 77/2023 ను దాఖలు చేయగా, సదరు కోర్టు వారు అనేక పర్యాయములు నోటీసులు కోర్టు నుండి పంపగా మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. అందుపై శ్రీ కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా మీకు నోటీసులు అమలు జరుపుటకు ది.వి. 28-11-2024వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు గాని, మీ తరుపున ప్లీడరు గాని శ్రీ కోర్టు వారి ఎదుట **ది.వి. 28-11-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** హాజరు అయ్యి మీ తరుపున ఆక్షేపణలు ఏమైనా ఉంటే దాఖలు చేయగలరు. లేని యెడల మీ తరుపున శ్రీ కోర్టు వారు పరోక్షము ఉత్తర్వులు చేయగలరు.

CHINTAPALLI SRINIVASA RAO, Advocate
రామచంద్రాపురం — Ramachandrapuram
తేదీ:23-11-2024 — Cell: 95534 51503

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ శ్రీ ముద్రకోళ శ్రీనివాస్, తండ్రి ముద్రకోళ వెంకటేశ్వరరావు గార్కి పొన్నమండ గ్రామంలో గల డాక్యుమెంట్ నెంబర్ 1911/2020 సెటిల్‌మెంట్ డాక్యుమెంట్ పొందియున్నారు. సదరు ఆస్థిని గృహ నిర్మాణం చేయుట కొరకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అమలాపురం బ్రాంచి నందు ఋణం తీసుకొనుచున్నారు. సదరు ఆస్థికి సంబంధించి లింకు డాక్యుమెంట్ ఒరిజనల్స్ రిజిస్టర్ దస్తావేజు నెంబర్ 1911/2020 (తేది.17-07-2020) ఈ రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్‌కు లింకు డాక్యుమెంట్‌గా ఉన్న 785/2003 (తేది.22-05-2003). ఈ డాక్యుమెంట్ జిరాక్స్ నిమిత్తం పొన్నమండ ఇంటి దగ్గర నుండి అమలాపురం వచ్చే దారిలో పడిపోవడం జరిగింది. వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్ అమలాపురం బ్రాంచి నుండి నా క్లయింట్ ఋణాన్ని వినియోగించుకుంటున్నారు. ఒరిజనల్ లింకు డాక్యుమెంట్ పోయిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా పారీఖత్తు 785/2003 (తేది.22-05-2003). దీనికి సంబంధించిన లింకు డాక్యుమెంట్ పారీఖత్తు 785/2003 మరియు 1911/2020 యొక్క ఒరిజనల్ డాక్యుమెంట్స్ సదరు బ్రాంచ్‌కు అవసరమైన అన్ని డాక్యుమెంట్స్‌తో పాటు డిపోజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు ఒరిజనల్ డాక్యుమెంట్స్ కనుగొన్న లేదా దొరికిన వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు లేదా పైన తెలిపిన నా క్లయింట్ చిరునామాకు వాపస్ చేయగలరు. ఇంకనూ తెలియజేయునది ఏమనగా ఈ డాక్యుమెంట్స్ దొరికిన వారు ఎవరైన వీటిని వినియోగించిన ఎడల చట్ట విరుద్ధమగును మరియు వారిపై అవసరమైన చట్టమైన చర్యలు తీసుకోబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

ఎన్.రమేష్, అడ్వకేట్ & నోటరీ,
అమలాపురం. సెల్:8008027999